# తాతబ్బాయి కథ



వెఱ్రినాగన్నా, ఈ తరం సజ్జు ఉట్టి కుఱ్ఱనాగమ్మలు. అప్పు అడగడంకూడా చేతగాదు. ఎందుకు పనికొస్తారంట. మా కాలంలో ఇలాగేనా మరి. మన తాతబ్బాయి ఉన్నాడంటే ఎంత గట్టివాడూ.....వాడు అప్పులిస్తే ఇలాగే చేశాడా, ఇంత అవకతవకగానే అడిగాడా మరి. నీకు తెల్సా వాడి పెళ్లి సంగతి. [తెలీదన్న భావానికి అభినయంగా అరుగుమీద కూలబడి స్తంభానికి జేరబడ్డాడు గుర్నాధం] నాన్నమ్మ కూతురు వరాలమ్మకు మనువెలా అయిందని. అదంతా ఓ కథగాదూ మరి. తాతబ్బాయీ, రావకిష్టుడూ ఇద్దరూ తోడబుట్టినవాళ్లేనాయె. ఏణ్నర్ధం అటూ ఇటూ గాళ్లేనాయె. పిల్లదాన్ని ఎవడికిచ్చి ఎవడిక్కాదనేట్టుటా. ఓనాడు మధ్యాన్నవేళ కుఱ్ఱాళ్ళిద్దరూ జెమాజెట్టీల్లా, రావలక్ష్మణుల్లా పోటాన పోటీలు పడుతూ వాకిట్లో చలవ పందిరేస్తూ వుండగా నానమ్మకేం వూహబోయిందో మరి– ఒరే తాతిగా ఒరే రావకిష్టుడూ అదలా ఒగ్గేసి మీరిలా రండఱ్ఱా అంది. అప్పగారంటే ఇద్దరికీ హడలే. పని ఉన్నపళంగా వదిలేసి చేతులు గట్టుకు నిలబడ్డారు. అరుగుపక్కన నానమ్మ పిల్లదానికి మొగుణ్ణిడేస్తోంది. ఏవిరా రావకిష్టుడూ వరాల్నిచ్చి పెళ్ళిజేస్తాగాని కూడెట్ట గలవఱ్ఱా అంది. రావకిష్టుడు గర్వంగా చిన్నాడికేసి చూసి వరాల్ని ఓరకంట చూసి చెస్ పెళ్లాని క్కూడెట్టలేని వాడుంటాడెస్. అంతగా యేం లేకపోతే అడుక్కు దెచ్చన్నా పెట్టనా అన్నాడు.

ఒరి నీయింట కోడిగాల్చా, ఏం కూత కూశావురా. కొంపకీ కులానికీ కూడా అపర్దిష్ట మాటంటివిగదరా. మాలక్ష్మినిచ్చి మనువుజేస్తే అడుక్కుతెచ్చి వణ్ణం పెడతా నంటావుఱ్ఱా అంది నానమ్మ నవ్వి.

మరి తాతబ్బాయీ నీమాటేవిటెరా, నువ్వూ పట్నంలో అడుక్కుదెస్తానంటావా అంది ఇంకోక్షణం ఆగి.

చెచేస్. అడుక్కోడవేంగతి అప్పా. సంపాయిత్తా. అందాకా అవసరమైతే ఎవడి తలో తాకట్టేసి అప్పదెచ్చి బువ్వపెడతా. అపాటి మొగాణ్ణికానా.

ఎవడూ ఇవ్వకపోతే నువ్వు ఇస్తావు అప్ప అన్నాడు తాతబ్బాయి ముసి ముసి నవ్వులు నవ్వుతూ.

నీ కడుపు చల్లగుండ. ఎంతమాటన్నావురా కడుపులో ఎంతోటి ఊహలున్నాయి అని ముక్కున వేలేసుకుని అలాగే విస్తుబోయింది నానమ్మ.

అమ్మా జెడయ్యవేవ్. మెడ నెప్పెడతాది అని మాలక్ష్మి వరాలు గావుకేకే సేవరకూ తల్లి తేరుకోనేలే.

సరే ఇద్దరిలోనూ తాతబ్బాయి ఇంత ప్రవేజకుడుగదా – అని, ఇంటిల్లపాదీ పెద్దవాడు రావకిష్టుడు వేపే మొగ్గినా, నానమ్మ పట్టుబట్టి పిల్లని వీడికే కట్టబెట్టింది. మరి తరువాత వాడెంత ప్రవేజకుడైనాడనీ. అప్పల్జెయ్యడం కూడా ఏమంత గొప్పపని కాదనుకో. అయితేనేం అందులో తలకాయలు మార్చడం, మాట సుళువూ, మనిషి సుళువూ తెలీడం ఉన్నాయి. తాతబ్బాయి ఇల్లుగట్టాడు, గుర్రబ్బండికొన్నాడు. పెదనాయుడనిపించుకున్నాడు. వాడు అప్పచేశాడంటే చేసినట్టే ఉండేదికాదు. ఇచ్చినాడిక్కూడా తెలిసేది గాదన్నమాట. ఒక్క నాకాడే వాడి ఆట సాగిరాలేదు. నేనీ విషయంలో కాలాంతకుణ్ణిలే.... ఎవరదీ ఆ వచ్చేది? నాన్నా చీకటడింది, కోడలు పిల్లను దీపందెచ్చి పెట్టమనూ వాకిటా. ఎవరది నర్సయ్యా! రా రా రావయ్యా అలా కూర్చో అన్నారు మునసబుగారు కథ ఆపి.

★ ★ ★